క్లుప్తంగా

కలమడుగు వాసికి బెస్ట్ రీసెర్చ్ స్కాలర్ అవార్డు


మధుకర్

జన్నారం: మండలంలోని కలమడుగు వాసి మధుకర్‌కు అరుదైన గౌరవం లభించింది. నోయిడా(న్యూఢిల్లీ)లోని ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ సైన్స్ టెక్నాలజీ రీసెర్చ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కరెంట్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ సేద్య విభాగంలో ఆయన చేసిన ప్రాజెక్ట్‌కు బెస్ట్ రీసెర్చ్ స్కాలర్ అవార్డు లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేస్తున్న ఆయన మొక్కజొన్న పంటపై డ్రోన్లు ఉపయోగించి కలుపు మందు పిచికారిపై పరిశోధన చేసి ప్రతిభ కనబర్చడంతో ఈ అవార్డు అందజేశారు. తల్లిదండ్రులు బొంతల నాగమణి- మల్లేశ్‌తోపాటు పలువురు ఆయన్ను అభినందించారు.

ఖాళీబిందెలతో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని బొగుడ గూడం టవర్ వాడలో పది రోజులుగా భగీరథ నీళ్లు రావడం లేదని మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొగుడగూడంలో భగీరథ ట్యాంకు ఉన్నా మంచినీటిని నింపడం లేదన్నారు. భగీరథ నీరు లేక అదేవాడలో బోర్‌వెల్ ఉన్నా మురికినీరు వస్తుందన్నారు. అధికారులు ఇప్పటికైనా పట్టించుకోవాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

కోటపల్లి: డ్రంకెన్ డ్రైవ్ కేసులో మండలకేంద్రానికి చెందిన ప్రేమ్‌సాగర్‌కు ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ చెన్నూర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ పి.రవికుమార్ తీర్పుచెప్పారు. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో ప్రేమ్‌సాగర్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు తేలింది. అతన్ని గురువారం చెన్నూర్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా ఈ మేరకు తీర్పుచెప్పారని ఎస్సై వివరించారు.

కోలిండియా స్థాయిలో రాణించాలి


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

శ్రీరాంపూర్: సింగరేణి క్రీడాకారులు కోలిండియా స్థాయిలో రాణించాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జీఎం టి. శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో కంపెనీ వార్షిక క్రీడల్లో భాగంగా గురువారం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఆటల్లో మెరుగైన నైపుణ్యం సాధించడంతోనే రాణిస్తారన్నారు. ఈసారి కోలిండియా పోటీల్లో కంపెనీ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏరియా ఎస్‌ఓటూజీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందర్‌రావు, క్రీడల గౌరవ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఐకే1ఏ, ఐకే-ఓసీపీ ఫిట్ కమిటీ

జైపూర్: జైపూర్ మండలం ఏఐటీయూసీ వోఎం(ఆర్గనైజింగ్ సెక్రెటరీ–మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ) అధ్యక్షతన ఐకే1ఏ, ఐకే-ఓసీపీ మైనింగ్ స్టాఫ్ ఫిట్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఐకే1ఏ ఫిట్ సెక్రెటరీగా జక్కుల వెంకటేశ్, అసిస్టెంట్ సెక్రెటరీగా ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సాయికృష్ణ నరేశ్, సాయి, రత్నరాజ్, ఐకే-ఓసీపీ ఫిట్ కమిటీ సెక్రెటరీగా సాయి, అసిస్టెంట్ సెక్రెటరీగా శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా నరేశ్ ఎన్నికయ్యారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచి సెక్రెటరీ బాజీసైదా, బెల్లంపల్లి రీజియన్ కాంట్రాక్టు ఉద్యోగుల సెక్రెటరీ అఫ్రోజ్‌ఖాన్ నేతృత్వంలో ఎన్నుకున్నారు.

బెల్లంపల్లిలో పారిశుధ్య పనులు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలో గురువారం స్వచ్ఛతా హీ సేవ-2024లో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టారు. పోచమ్మ చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సిబ్బందితో శుభ్రం చేయించారు. పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. 14 వార్డులో ఇంటింటికి వెళ్లి తడి,పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించేలా బస్తీవాసులకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ శ్వేత, కౌన్సిలర్లు ఆస్మాషేక్, బొడ్డు నారాయణ పాల్గొన్నారు.

- సింగరేణి కాలనీల్లో కూడళ్లు గుంతలమయం
- కాలనీవాసుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

రోడ్లు అధ్వానం


నస్పూర్ షిర్కే కాలనీ చౌరస్తాలో గుంతలమయమైన రోడ్డు

శ్రీరాంపూర్: సింగరేణి కాలనీల్లో కూడళ్లు అధ్వానంగా మారాయి. శ్రీరాంపూర్ డివిజన్ పరిధిలోని నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీ, నాగార్జున కాలనీ, తదితర కాలనీల్లోని ప్రధాన రోడ్లపై కూడళ్లు గుంతలమయమయ్యాయి. రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత సంవత్సరం నుంచే కొద్ది కొద్దిగా చెదిరిపోతూ గుంతలు పడ్డ ఈ రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారాయి. మనోరంజన్ సముదాయం నుంచి ఫ్లడ్ కాలనీకి వెళ్లేదారిలో ఐఎన్టీయూసీ కార్యాలయం వద్ద రోడ్డు కుంగడం, గుంతలు పడింది. ప్రధాన రోడ్డు కావడంతో తాళ్లపల్లి, సింగపూర్ ఆర్ అండ్‌ఆర్ కాలనీలకు వెళ్లే వాహనాలు, ఇతర ఇంటి నిర్మాణ కోసం వెళ్లే ఇసుక ట్రాక్టర్లు, ఇటుక లారీలు, మట్టి లారీలతో రోడ్డు అధ్వానంగా మారింది. బైక్‌పై వెళ్లే వాహనదారులు అదుపు తప్పి కిందపడిపోతున్నారు. షిర్కేలోని వేంకటేశ్వర్ ఆలయం కాంప్లెక్స్ కూడలి వద్ద రోడ్డు చెడిపోయింది. నిత్యం ఈ కూడలి మీదుగా గనులకు డ్యూటీలకు వెళ్లే కార్మికులు రాత్రివేళ బైక్‌లు అదుపుతప్పి గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. ప్రతీ మంగళ, శనివారాంతపు సంతకు వెళ్లేవారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పునరావాస కాలనీ ప్రధాన రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. కాలనీలకు తాగునీటి కోసం గతేడాది పైప్‌ల కోసం అక్కడక్కడ రోడ్లు తవ్వారు. మట్టితో పూడ్చడం వల్ల వర్షాలకు గుంతలమయ్యాయి. కాలనీల్లో అంతర్గత రోడ్లు బాగున్నా కూడళ్ల వద్దనే అధ్వానంగా తయారైనా సింగరేణి అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఏరియా ఉన్నతాధికారులు స్పందించి గుంతల రోడ్లు బాగు చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలి


మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మాట్లాడారు. జీహెచ్‌ఎంసీలో మాదిరిగా వేతనాలను మంచిర్యాలలో అమలు చేసేలా కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరారు. జీవో 60 ప్రకారం డ్రైవర్లకు వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్‌లో 42 మంది కార్మికుల డబ్బులను పీఎఫ్ కార్యాలయానికి పంపించడం లేదన్నారు. పేర్లు, పుట్టిన తేదీ తప్పులుగా ఉన్నాయన్న సాకుతో జమచేయడం లేదని, పేర్లను సరిచేసి ఉన్నతాధికారులకు పంపించాలని కోరారు. వయస్సు పైబడిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. నాయకులు శ్యాంకుమార్, తిరుపతి, లింగయ్య, శ్రీనివాస్, సది, రాజేశం, లక్ష్మీనారాయణ, లింగయ్య, రవి, నవీన్, కొప్పుల శ్రీను పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో కాలువలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని మున్సిపల్ టీపీవో తిరుపతమ్మ పేర్కొన్నారు. పలువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం మార్కెట్ ప్రాంతంలో పలు షాపుల ముందు, వెనుక భాగాన్ని సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. షాపుల వద్దకు వచ్చేవారు రోడ్డుపై వాహనాలు నిలపాల్సి వస్తుందన్నారు. నిర్వాహకులు అక్రమ నిర్మాణాలు తొలగించాలని లేకపోతే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

ఓటరు జాబితాకు సహకరించండి


నెన్నెలలో నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి

నెన్నెల/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/వేమనపల్లి/మందమర్రిరూరల్/భీమిని/కాసిపేట/తాండూర్: ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీవోలు దేవేందర్‌రెడ్డి, మధుసూదన్, రాజేశ్వర్, సత్యనారాయణసింగ్, గంగామోహన్, శ్రీనివాస్ కోరారు. నెన్నెల, హాజీపూర్, వేమనపల్లి, మందమర్రి, కాసిపేట, భీమిని, కన్నెపల్లి, తాండూర్ ఎంపీడీవోల కార్యాలయాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈనెల 21 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే చెప్పాలన్నారు. 26న అభ్యంతరాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని 28న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఎంపీవోలు అక్తర్, సబ్దర్ అలీ, శ్రీనివాస్, అనిల్‌కుమార్, సీఐ కుమారస్వామి, పర్యవేక్షకుడు సయ్యద్ ఇఫ్తార్‌అలీఖాన్, బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

‘పెద్దనపల్లిలో ఓటుహక్కు కొనసాగించాలి’

కాసిపేట: పెద్దనపల్లి పంచాయతీకి చెందిన 65 మంది ఓటర్లను అదే పంచాయతీలో కొనసాగించాలని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో సబ్దర్ అలీకి గురువారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీలో ఆర్థికస్థోమత లేని కొన్ని కుటుంబాలు గృహాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో సోమగూడెం(కె)లో ఉంటున్నారని, తామంతా పెద్దనపల్లిలో ఓటుహక్కు కల్పించాలని వారు కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ


చెన్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


బెల్లంపల్లి: ర్యాలీ చేస్తున్న ముస్లింలు


రామకృష్ణాపూర్: ర్యాలీలో ముస్లింలు

బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/చెన్నూర్/తాండూర్: మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు వేడుకలు పురస్కరించుకొని బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, చెన్నూర్, తాండూర్‌లో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఆయా మసీదులు, ఈద్గాల వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రధాన కూడళ్ల వరకు కొనసాగింది. బెల్లంపల్లిలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య, బెల్లంపల్లి రూరల్‌సీఐ అఫ్జలుద్దీన్, పలువురు ఎస్సైలు శాంతిభద్రతలను పర్యవేక్షించారు. చెన్నూర్‌లోని ఐబీ వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఆనంతరం అన్నదానం నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, సీఐలు రవీందర్, సుధాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, ఆరీఫ్, ముస్లిం పెద్దలు, ఇమామ్‌లు, యువకులు పాల్గొన్నారు. తాండూర్ మండలంలో తాండూర్, మాదారం ఎస్సైలు కిరణ్‌కుమార్, అనూష బందోబస్తు నిర్వహించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న అర్పిత మారంరెడ్డి

లక్సెట్టిపేట: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారం రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర, ఎస్సీ బాలికల వసతి గృహం, ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యాహక్కు, ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ చట్టాల గురించి తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. ఏజీపీ వేల్పుల సత్యం, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రవీందర్, న్యాయవాదులు అక్కల శ్రీధర్, పద్మ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఐటీఐలో మిగిలిన సీట్లకు వాక్-ఇన్ అడ్మిషన్లు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో మిగిలిన సీట్లకు ఈనెల 20 వాక్-ఇన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ రమేశ్ తెలిపారు. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో ప్రైవేట్ ఐటీఐలో 228, ప్రభుత్వ ఐటీఐలో 69 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత ఐటీఐలో మధ్యాహ్నం 1గంటకు ఐటీఐ రిజిస్ట్రేషన్ ఫారంతో అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

జిల్లా స్థాయిలో ప్రతిభ

చెన్నూర్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 బాల, బాలికల విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. బాలుర విభాగంలో ఎ.ఈశ్వర్‌ప్రసాద్, కె.అజయ్, ఎ.వర్షిత్, బి.చక్రి, డి.అంజి, బి.సాయితేజ, జి.విష్ణు, ఐ.సుక్షిత్, ఆర్.దిలీప్, డి.చరణ్, జి.జశ్వంత్, సీహెచ్ అరవింద్, బాలికల విభాగంలో సంగీత, బ్లెసీనా, టి.వైష్ణవి, డి.సంజన, సీహెచ్ హసిని, ఎ.మల్లిక, బి.రక్షిత, ఎం.బ్లేసీ, ఎస్.అంజలి దేవి, జి.రెహాస్రా, కె.విష్ణుప్రియ, ఎం.అమూల్య ఎంపికైనట్లు పేర్కొన్నారు.

వైద్య పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద, ఎస్‌ఎన్‌సీయూ విభాగంలో ఖాళీగా ఉన్న 4 పీడీయాట్రిషన్ పోస్టులు, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లో ఆరు ఎంబీబీఎస్ వైద్యుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి హరీశ్‌రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 21న ఉదయం 11 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో, కలెక్టరేట్ భవన్‌లో వాక్‌ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికేట్లతో రావాలని పేర్కొన్నారు.

ఆరోగ్య విద్యపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక మోడల్ స్కూల్‌లో జిల్లా ఆరోగ్య వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను హెల్త్‌ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌ఓ రామూర్తి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ వివరించారు. వైద్యాధికారి అశోక్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ నాగవర్మ, ఏఎన్‌ఎం సరిత, వసతిగృహ ఇన్‌చార్జి స్వప్న పాల్గొన్నారు.

క్యాన్సర్, రక్తదానంపై అవగాహన

మంచిర్యాలఅర్బన్: స్థానిక వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో గురువారం లయన్స్ క్లబ్‌మంచిర్యాల, లయన్స్‌క్లబ్ మంచిర్యాల గోల్డెన్ జూబ్లీ సంయుక్తంగా క్యాన్సర్, బ్లడ్ డొనేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తదానంపై అవగాహన కల్పించడంతోపాటు కరపత్రాలను ఆవిష్కరించారు. క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్‌రెడ్డి వివరించారు. రక్తదానం చేసేందుకు విద్యార్థులు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రోగ్రామ్ చైర్మన్ మధుసూధన్‌రెడ్డి, లయన్స్ సభ్యులు చంద్రమోహన్‌గౌడ్, వినయ్‌కుమార్, నాగేందర్ పాల్గొన్నారు.

ఊరచెరువు ఆక్రమణలు తొలగించాలి

మందమర్రిరూరల్: ఊరు మందమర్రికి వెళ్లేదారి పక్కన ఊరచెరువు ఎఫ్‌టీఎల్ గుర్తించి ఆక్రమణలు తొలగించాలని బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కుమార్‌దీపక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారం క్రితం ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించినా చర్యలు తీసుకోలేదన్నారు. ఆయన వెంట బోర్లకుంట రాయలింగు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

మంచిర్యాలటౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలోని చెత్తాచెదారాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఆధ్వర్యంలో తొలగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. స్వచ్ఛత పాటించాలని వారితో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ మేనేజర్ విజయ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్, మెప్మా ఆర్పీలు, సీవోలు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

కాసిపేట: పీఆర్టీయూ టీఎస్‌తో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా గౌరవ అధ్యక్షురాలు బండ శాంకరి తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ వేదికగా ఇటీవల బదిలీల్లో నూతనంగా పాఠశాలల్లో విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో ఎస్జీటీలకు పీఎస్ హెచ్‌ఎం పోస్టులు ఇప్పించడంతోపాటు ఎస్‌ఏలకు పదోన్నతులు కల్పించేలా కృషి చేస్తామన్నారు. శ్రీనివాస్, రమణారెడ్డి,ఖలీల్, నాగేశ్వర్, కృష్ణగోపాల్‌రావు పాల్గొన్నారు.

21న రాష్ట్రబంద్ విజయవంతం చేయండి

కాసిపేట: జైనూరు మండలంలో లైంగికదాడికి గురైన ఆదివాసీ మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న ఆదివాసీల సంఘాల ఆధ్వర్యంలో తుడుందెబ్బ ఇచ్చిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. మండలంలోని దేవాపూర్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. వ్యాపార, విద్యాసంస్థలు, కళాశాలలు, వ్యాపారులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఈ బంద్‌కు సహకరించాలని కోరారు. నాయక్‌పోడ్ సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు సంద్ర భూమన్న, రాయిసెంటర్ ఉపమేడి కుమ్రం జనార్దన్ పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించాలని ధర్నా



రామకృష్ణాపూర్: ధర్నా చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాలను ప్రకటించి అందులో నుంచి 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జి జీఎం టి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరం సంస్థ 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిందన్నారు. కంపెనీ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడమే కాకుండా టర్నోవర్‌లో రికార్డు సృష్టించిందన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా లాభాలను ప్రకటించి అందులో నుంచి కార్మికులకు వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కమిటీ నాయకులు పొగాకు రమేశ్, అన్వేష్ రెడ్డి, ఎండీ లాలా, బత్తుల రాజేశం, గొర్ల సంతోశ్, మైపాల్ రెడ్డి, గడ్డం సుధాకర్, సాదుల భాస్కర్, పాపిరెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాల్లో నుంచి 35 శాతం వాటాను కార్మికులకు పంపిణీ చేయాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ డిమాండ్ చేశారు. ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. అనంతరం జీఎం దేవేందర్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు రవీందర్, ఈశ్వర్, కందల్‌రావు తదితరులు ఉన్నారు.

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సంస్థకు వచ్చిన లాభాల్లో వాటా చెల్లించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సివిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డీవైపీఎంఈ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.బ్రహ్మానందం, నాయకులు జి.మల్లేశ్, వెంకటేశ్, నాగరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

దండేపల్లి/భీమిని/జైపూర్: రైతు రుణమాఫీ చేయాలని రైతు సంఘాలు తలపెట్టిన హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ముట్టడికి దండేపల్లి, జైపూర్, భీమిని మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు వెళ్లకుండా పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేశారు. దండేపల్లిలో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ లింగన్న, రవీందర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సంతోష్, రాజమల్లు, భీమిని మండలంలోని రైతు సంఘం నాయకుడు తిరుపతి తదితరులు ఉన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

కోటపల్లి: ఉద్యోగుల పెండింగ్ డీఏలు విడుదల చేసి పెండింగ్ బిల్లులు చెల్లించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పార్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీని ప్రకటించాలని, ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్, రాజేందర్, సునీల్ పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

చెన్నూర్: చెన్నూర్ శనిగకుంట మత్తడి పేల్చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొడెంకి చందు డిమాండ్ చేశారు. గురువారం శనిగకుంటను సందర్శించి మాట్లాడారు. కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. మత్తడి పేల్చివేత పట్ల సమగ్ర విచారణ జరిపి దుండగులను శిక్షించాలన్నారు. రైతులు, మత్స్యకారులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. నాయకులు సిడాం సమ్మక్క, రాతిపల్లి నగేశ్, బొగె సత్యం, కామెర మధు, అనసూర్య, శ్యామల ఉన్నారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

నస్పూర్: పట్టణ పరిధిలోని ఇందిరానగర్ ఏరియా పాతకోళ్లఫాంలో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై బుధవారం రాత్రి మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. 9 మంది పేకాటరాయుళ్లను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.30,970 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితులను సీసీసీ నస్పూర్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

దండేపల్లి: ఇన్‌చార్జి ఎంఈవోగా విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రవీందర్ కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో జన్నారం ఎంఈవో విజయ్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

గుడుంబా విక్రేతకు జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేటకు చెందిన రాసమల్ల శోభ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా తహశీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే ఎదుట గురువారం బైండోవర్ చేశారు. పలుమార్లు గుడుంబా విక్రయించడం, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో తహసీల్దార్..ఆమెకు రూ.50 వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ ఎస్సై మనీషారాథోడ్ తెలిపారు.

సన్మానం

దండేపల్లి: కన్నెపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సనందా ఇటీవల ధర్మరావ్‌పేటకు బదిలీ అయ్యారు. దీంతో ఆమెను కన్నెపల్లి గ్రామస్తులు గురువారం స్థానిక జీపీ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మగ్గిడి శ్రీనివాస్, గ్రామస్తులు నగేశ్, సాంబయ్య, తిరుపతి, కుమార్, మహేశ్, మల్లేశ్, వెంకటేశ్, రవిగౌడ్, రాజయ్య పాల్గొన్నారు.

మహాసభ విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నంలో ఈనెల 25న నిర్వహించే మత్స్యకారుల మహాసభను విజయవంతం చేయాలని వాడబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడెంకి మహేశ్, జిల్లా గంగపుత్ర సంఘం నాయకుడు గుమ్ముల శ్రీనివాస్ కోరారు. జిల్లాకేంద్రంలో గురువారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావస్తున్నా మత్స్యకారుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. మహాసభకు మత్స్యకారులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. రాజన్న, కృష్ణ, సతీశ్, మాధవ్, సృజన్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పునఃప్రారంభించాలి

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉన్న పబ్లిక్ మరుగుదొడ్లు పునఃప్రారంభించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. దేవవరం, రమణారెడ్డి, భానుచందర్, రవికిరణ్ పాల్గొన్నారు.

బీసీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

పాతమంచిర్యాల: బీసీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో బీసీ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులందరికీ బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. భీంసేన్, మహేశ్, సతీశ్ ఉన్నారు.

భీమారంలో పోషణమాసోత్సవం

భీమారం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ స్వప్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.